# బాల ఆవిష్కరణలకు వేళాయె..

- విద్యాశాఖ సన్నాహాలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యం వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం ప్రదర్శనలను నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఒక అంశంపై అందుకు అనుగుణంగా ప్రయోగాలను రూపకల్పన చేయాల్సి ఉంటుంది. కాగా, ఈ యేడాది పర్యావరణానికి పెద్దపీట వేసి ప్రధాన అంశంగా, టెక్నాలజీ ఫర్ సొసైటీగా నిర్దేశించారు.



ఆవిష్కరణను పరిశీలిస్తున్న అధికారి( ఫైల్ )

జగిత్యాల, డిసెంబర్ 18 : ఈసారి సైన్స్‌ఫేర్‌లో హెల్త్, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్, అగ్రికల్చర్ కమ్యూనికేషన్, ట్రాన్స్‌పోర్టేషన్, కంప్యూటేషనల్ థింకింగ్‌కు అనుగుణంగా ఆవిష్కరణలను ప్రదర్శించవలసి ఉంటుంది. విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలతోపాటు ఉపాధ్యాయులు సైతం నూతన బోధనోపకరణాన్ని ఆవిష్కరించవచ్చు. వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థి వెంట ఒక గైడ్ టీచర్ హాజరు కావాలి. అందులో 6వ తరగతి నుంచి 8వతరగతి విద్యార్థులు జూనియర్ విభాగం, 9వతరగతి 10వ తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చు. ప్రతి పాఠ శాల నుంచి మూడు లేదా ఐదు అంశాలపై ప్రదర్శన ఇవ్వవచ్చు. గూగుల్ ఫామ్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ ప్రదర్శనకు అర్హులు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు మానక్, బాల్ వైజ్ఞానిక ప్రదర్శన జనవరి 2024 మూడో వారంలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించే అవకాశం ఉంది.

## పోటెత్తిన రాజన్న క్షేత్రం

వేములవాడ టౌన్, డిసెంబర్ 18: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం పోటెత్తింది. 50వేలకుపైగా భక్తులతో కిటకిటలాడింది. దీంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. రద్దీ దృష్ట్యా అధికారులు గర్భగుడిలో ఆర్జిత సేవలను నిలిపివేశారు. భక్తులు క్యూలో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ₹28లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. అనుబంధ దేవాలయాల్లోనూ రద్దీ కనిపించింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పట్టణ సీఐ కరుణాకర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో భక్తులు



## బైపాస్ రోడ్డు జిగేల్

కరీంనగర శివారులోని సిరిసిల్ల బైపాస్ రోడ్డు జిగేల్‌మంటున్నది. నాడు అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును గత బీఆర్‌ఎస్ సర్కారు కోట్లాది నిధులతో నాలుగువరుసలుగా విస్తరించడమే కాదు, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ఇంకా దారి పొడవునా హైమస్ట్ లైట్లు అమర్చగా, రాత్రి పూట వెలుగులు విరజిమ్ముతున్నాయి. నగర వాసులు, వాహనదారులకు ముచ్చట గొలుపుతున్నాయి.

**- కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 18**

సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వెలుగులు



కరీంనగర్‌లోని ఓ బియ్యం దుకాణంలో నిల్వలు



సన్న బియ్యం

# సన్న బియ్యం ధరలకు రెక్కలు


- ఒక్కసారిగా పెరిగిన రేట్లు
- మార్కెట్‌లో క్వింటాల్‌కు ₹వెయ్యిపైనే పెంపు
- డిమాండ్ తగినట్టు ఉత్పత్తి లేక కొరత
- పండిన కాస్త ధాన్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- పొరుగు జిల్లాల నుంచి మన జిల్లాకు బియ్యం దిగుమతి
- మధ్య తరగతిపై పెను భారం
- అమ్మకాలు తగ్గాయంటున్న వ్యాపారులు

కరీంనగర్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : సన్న బియ్యం ధరలు పెరుగుతున్న కొద్దీ సామాన్యుల్లో దడ పుడుతున్నది. ఉమ్మడి జిల్లాలో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తున్నారు. దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు శ్రమ లేకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుంటున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు సన్న రకం వడ్లపై దృష్టి పెట్టడం లేదు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుండడంతో ఆ ప్రభావం ఇప్పుడు కనిపిస్తున్నది. అయితే, కేసీఆర్ ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించినా ఎక్కువ మంది రైతులు దొడ్డు రకాలకే మొగ్గు చూపుతూ వచ్చారు. అయితే, డిమాండ్‌కు తగినట్లు సన్న రకాల ఉత్పత్తి లేక పోవడం, గత వానకాలంలో వచ్చిన తుఫాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వరి భారీగా దెబ్బతినడంతో అక్కడి వ్యాపారులు తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పండిన సన్నాలు, దొడ్డు రకం వడ్లను ఎక్కువ శాతం కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు కూడా ఇక్కడి సన్నాలకు భారీ ధర చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో సన్న వడ్లు స్థానిక అవసరాలకు కొరతగా మారాయి. దీంతో సన్న బియ్యానికి ధరలు అమాంతం పెరిగాయి.

### మునుపెన్నడూ లేని విధంగా..

సన్న బియ్యం ధరలు మునుపెన్నడూ లేని విధంగా సామాన్యులకు చుక్కలు చూపుతున్నాయి. వారం కింద ఉన్న ధర ఇప్పుడు లేదు. పైగా రోజుకో విధంగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొన్నది. మార్కెట్‌లో ప్రధానంగా జైశ్రీరాం, హెచ్ఎంటీ, బీపీటీ సన్న రకం బియ్యానికి మంచి డిమాండ్ ఉంటుంది. వారం కింద జైశ్రీరాం మంచి రకం బియ్యం క్వింటాలు ధర ₹6,400 ఉంటే ఇప్పుడు ₹7,200 ఆపైన పెరిగింది. అంటే దీనిపై ధర ₹800 పెరిగింది. వారం కింద హెచ్ఎంటీ మంచి రకం ధర క్వింటాలుకు ₹6 వేలు ఉంటే ఇప్పుడు దీని ధర ₹6,400 పలుకుతున్నది. దీనిపై ₹400 పెరిగింది. అదే బీపీటీ బియ్యం వారం కింద క్వింటాలుకు ₹4,800 ఉండగా ఇప్పుడు ₹5,600 పలుకుతున్నది. అంటే దీనిపై కూడా ₹800 పెరిగింది. వారం కింది నుంచే ఈ పరిస్థితి కనిపిస్తున్నది. ఏడాది కింద కాస్త స్థిరంగా ఉన్న ధరలు వారం నుంచి విపరీతంగా పెరుగుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతున్నది. ఏడాది కింద జైశ్రీరాం బియ్యం క్వింటాలుకు ₹6,400, హెచ్ఎంటీ ₹4,800, బీపీటీ ₹5,600గా వారం పది రోజుల వరకు స్థిరంగా ఉన్నాయి. ఒక్కసారిగా బియ్యం ధరలు ఈ విధంగా ఆకాశాన్ని అంటుతుండడంతో ఏం కొనాలో, ఏం తినాలో అర్థంకాని అయోమయ స్థితిలో సామాన్యులు పడుతున్నారు.

### ఇన్నేళ్లలో ఇంత ధరలు చూడలే



నేను 18 ఏండ్లుగా బియ్యం వ్యాపారం చేస్తున్న. ఈ సారి సన్న బియ్యం ధరలు చాలా పెరిగినయి. వారంలో ఇంత భారీగా ధరలు పెరగడం ఇదే మొదటిసారి చూస్తున్న. ఉమ్మడి జిల్లాకు నిజామాబాద్, మిర్యాలగూడ, తదితర ప్రాంతాల నుంచి సన్నాలు తెప్పించుకుంటం. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలే భారంగా మారుతున్నయి. ఇప్పుడు ధరలు పెరగడం మరింత భారమవుతున్నది. ఒక్కో కస్టమర్‌కు చెప్పలేక పోతున్నం. ఇంత ధర పెట్టి కొనలేమని చాలా మంది మొఖం మీదనే అంటున్నరు. వారం పది రోజులుగా అమ్మకాలు పడిపోయినయి. జిల్లాలో సన్న రకం వడ్లు ఎక్కువగా సాగు చేయకపోవడం, అవసరానికి తగినట్లు సన్న రకాల వడ్లు అందుబాటులో లేక పోవడంతో బియ్యం ధరలపై ఎఫెక్ట్ పడుతున్నది. ఇంత అస్థిరమైన ధరలు మాత్రం నెనెప్పుడూ చూడ లేదు. ఒకసారి పెరిగిందంటే ఏడాది వరకు అవే ధరలు ఉండే వి. కానీ, ఇప్పుడు రోజు రోజుకూ మారుతున్నయి.. ఇదే ఆందోళన కలిగిస్తంది.

**- ఎన్ గంగారం, బియ్యం వ్యాపారి (కరీంనగర్)**

### ఇదే అదునుగా మాయాజాలం

సన్న బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కొందరు మిల్లర్లు, ట్రేడర్లు తమ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో వచ్చిన సన్న రకం వడ్ల దిగుబడిని ఇతర రాష్ట్రాల వ్యాపారులు తీసుకెళ్తుండగా.. మన జిల్లా వ్యాపారులు మాత్రం ఎక్కువగా నిజామాబాద్, మిర్యాలగూడ జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మిల్లర్లు కొందరు సన్న బియ్యం మరాడించి విక్రయించేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. స్థానికంగా కేవలం 30 శాతం మాత్రమే సన్న బియ్యం మార్కెట్‌కు వస్తున్నది. ఈ నేపథ్యంలో కొందరు ట్రేడర్లు తమ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని మిల్లుల్లో సాంబమసూరిలో వివిధ రకాల వడ్లను మరాడించినప్పుడు వచ్చే బియ్యం క్వాలిటీని బట్టి జైశ్రీరాం, బీపీటీ, హెచ్ఎంటీ రకాలుగా మార్చుకుంటున్నట్లు తెలుస్తున్నది. కొందరు వ్యాపారులు కూడా కవర్లు మార్చుతూ క్వాలిటీ తక్కువ ఉన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా బియ్యంపై జీఎస్టీ విధించినప్పటి నుంచి 26 కిలోల బస్తాల్లో బియ్యం విక్రయిస్తున్నారు. అయితే, కొనుగోలు చేసిన చాలా బియ్యం సంచుల్లో 25 కిలోలే ఉంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ భారమంతా సామాన్య, మధ్య తరగతి ప్రజలే భరించాల్సి వస్తున్నది.



ధర్మపురి : పెగడపల్లిలో ర్యాలీ తీసి నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

# ఆటోడ్రైవర్ల కన్నెర్ర

- ఉమ్మడి జిల్లాలో ఆందోళన బాట
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం
- ఫ్రీ బస్సు పథకంతో ఉపాధి దెబ్బతిన్నదని ఆవేదన




చొప్పదండి : పట్టణంలో ఆటోలతో ర్యాలీ తీస్తూ నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

జగిత్యాల అర్బన్/ చొప్పదండి, డిసెంబర్ 18: ఆటోడ్రైవర్ల ఆందోళన కొనసాగుతున్నది. రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నది. సోమవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్గిరాజుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకం తెచ్చి తమ పొట్టకొట్టిందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మీ పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. సోమవారం జగిత్యాల డీజిల్ ఆటో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ దాకా భారీ ర్యాలీ తీశారు. ఆటో యజమాని, డ్రైవర్‌కు నెలకు రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతూ ప్రజావాణిలో జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. రాయికల్‌లో ఆటోడ్రైవర్ సంక్షేమ సంఘం అధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన చేపట్టారు. పెగడపల్లి, గొల్లపల్లిలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ తీశారు. అలాగే చొప్పదండి పట్టణంలో మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఆయాచోట్ల కార్మికులు మాట్లాడారు. బస్సు ఫ్రీతో తమకు గిరాకీ లేకుండా పోయిందని, ఆటోల ఈఎంఐలు కట్టలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, లేదంటే తమపోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జగిత్యాల : ఆటో యూనియన్ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



### ప్రభుత్వం ఆదుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, వారికి ప్రతి నెలా ₹10వేల జీవన భృతి చెల్లించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ర్యాలీకి మద్దతు పలికి, మాట్లాడారు. మహాలక్ష్మీ పథకంతో జిల్లాలోని 40వేల ఆటో యజమానులు, ఆటో డ్రైవర్లు ఉపాధి ప్రమాదంలో పడిందని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని, ప్రభుత్వం స్పందించేదాకా వారి తరపున పోరాటం సాగిస్తామన్నారు. మరోవైపు జిల్లాలోని ప్రతి రూట్‌లో బస్సులను నడిపించి ఉచిత ప్రయాణాన్ని మహిళలకు చేరువచేయాలని సూచించారు. బస్సు ఫ్రీ చేసిన ప్రభుత్వం, ఆడబిడ్డలకు తులం బంగారం, ప్రతి మహిళకు ₹2500 పెన్షన్ ఇచ్చే విషయంలో పక్కదారి పట్టిస్తున్నారని మండి పడ్డారు. ఈ ధర్నాలో డీజిల్ ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆరుముల్ల శ్రీనివాస్, ఆటో కార్మికులు ఉన్నారు.



మూడపల్లిలోని బంతి తోట

# సిరుల బంతి

- కాసులు కురిపిస్తున్న పూదోట
- లాభాలు గడిస్తున్న యువ రైతు

మూడపల్లికి చెందిన రైతు పుల్కం తిరుపతి మూస సాగుకు స్వస్తి చెప్పి.. సిరులు కురిపించే బంతి, కూరగాయల సాగుపై దృష్టిపెట్టాడు. పండుగలకు పంట చేతికందేలా పూదోటను వేసి.. స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నాడు. కష్టానికి తగిన ఫలితం రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

చందుర్తి, డిసెంబర్ 18: తిరుపతి గతంలో ఉపాధి లేక గల్ఫ్‌బాట పట్టాడు. తల్లి ఆరోగ్య పరిస్థితి బాగాలేక స్వదేశానికి తిరిగివచ్చాడు. ఆయనకు మూడున్నర ఎకరాల భూమి ఉన్నది. తిరుపతికి చిన్నప్పటి నుంచి ఎవుసం అంటే చాలా ఇష్టముండేది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మెట్ట ప్రాంతమైన చందుర్తి మండలానికి గోదావరి జలాలు రావడంతో సాగునీటికి కష్టాలు తీరాయి. దీంతో తనకున్న మూడు ఎకరాల్లో వరి, 20 గుంటల్లో గత ఆగస్టు నెలలో బంతిపూల తోటను సాగు చేశాడు. ఇందు కోసం ₹32వేల పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం బంతి పూలను సమీప మార్కెట్ విక్రయిస్తున్నానని, అయ్యప్ప దీక్షలు, సంక్రాంతి పండుగల నేపథ్యంలో గిరాకీ బాగుందని రైతు తిరుపతి సంతోషంగా చెబుతున్నాడు. వరి, పూలు, కూరగాయలు పండిస్తున్నానని, మొదటి ప్రయత్నంలోనే సక్సెస్ కావడం ఆనందంగా ఉందని అంటున్నాడు. సమీప గ్రామాల యువకులు ఫొటో షూట్ కోసం తన తోటల్లోకి రావడం సంతోషంగా ఉందని చెబుతున్నాడు.



బంతి తోటలో కలుపుతీస్తున్న యువ రైతు పుల్కం తిరుపతి